# మన దేవుడు ప్రేమామయుడు

"మన దేవుడు సన్మార్గ సంబంధి" అనే పాఠంలో, పరిశుద్ధత అనేది ప్రధానమైనది లేక ప్రాథమికమైన దేవుని గుణలక్షణమని, ఆయన పరిశుద్ధుడై ఉన్నట్టు మనమును పరిశుద్ధులమై ఉండాలని మనం నేర్చుకున్నాం. ఈ గుణము, మిగిలిన దేవుని గుణగణ ములవలెనే ఆయన దైవ స్వభావమై ఉంటుంది. దేవునికి వెలుపల దాని పరిపూర్ణత సాధ్యపడదు. మనకు ఆయన ప్రత్యక్షపరచుకొన్న వాటన్నిటికి అది ఆధారమైయుంది. సన్మార్గంగా కార్యములను జరిగించడం ఆయన స్వభావం ఎందుకంటే ఆయన పరిశుద్ధుడై యున్నాడు.

దేవుని స్వభావ లక్షణాల్లో మరొకటి ప్రేమ, పరిశుద్ధతవలెనే, దేవునియందు మాత్రమే ప్రేమ పరిపూర్ణంగా కన్పిస్తుంది. ప్రేమించడం అనేది దేవుని స్వభావంలో ఎంతగా భాగమైయుందంటే, "దేవుడు ప్రేమయైయున్నాడు" అని మనం చదువుతాం (1 యోహాను 4:8).

## ఆయన ప్రేమ వర్ణింపబడింది

దేవుని పరిపూర్ణ ప్రేమను గూర్చి మాట్లాడడానికి నరమాత్రులకు కష్టం. పరిపూర్ణమైన దేనిని గూర్చి మాట్లాడడమయినా మనకు కష్టమే. వాస్తవానికి, పరిపూర్ణమైన దానిని గూర్చి మాటలాడడానికి మనం కొంత ధర్మ సంకటంలో పడతాం. పరిపూర్ణతను గూర్చి మనం మాట్లాడితే, మన అపరిపూర్ణతలను మనం ఎరుగుతాం. మాటలు, కార్యములు, లేక మరొకని ఉద్దేశాలను వ్యతిరేకించేటప్పుడు, "నేను అంత పరిశుద్ధుడను కాదు, కాని ...?" అని యోగ్యతలను గూర్చి మాట్లాడతాం.

"సద్గుణముల" యొద్దకు వచ్చినప్పుడు, మనందరికి మన పరిమితులున్నాయి. ఇది ఎల్లవేళలా సత్యమైయుంది. చరిత్ర గమనమంతటిలో "సద్గుణం" అనేది అక్కరతో కూడిన ప్రధాన అంశమైయుంది. క్రీ.శ. నాల్గవ శతాబ్దపు గ్రీకులు – జ్ఞానము, ధైర్యము, పరిమితత్వము, మరియు న్యాయము[1] అనే నాల్గు ప్రధానమైన సద్గుణాలున్నట్టు నమ్మేవారు. క్రైస్తవ యుగంలోని మధ్యకాలంలో విద్యావంతులు పై చెప్పబడిన నాల్గు సద్గుణాలను "సహజమైనవని"; విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ అనేవి "దైవశాస్త్ర సంబంధమైన" సద్గుణాలని భావించారు.

సద్గుణాలను గూర్చిన బైబిలు భావన యింకా ఎక్కువను చేర్చుతోంది. "దేవా, నాయందు శుద్ధ హృదయమును కలుగజేయుము" అని వేదనతో విలపించిన దావీదుతో మనం జతకూడగలం. "యేసు మోకాళ్లయెదుట సాగిలపడి – ప్రభువా, నన్ను విడిచిపొమ్ము, నేను పాపాత్ముడనని" చెప్పిన పేతురు యొక్క మాటలను మనము

ప్రతిధ్వనింపవచ్చు (లూకా 5:8). క్రైస్తవ గుణగణాలను ఒత్తి పలికే క్రొత్త నిబంధన యొక్క రెండు ప్రధాన పట్టికలలో సద్గుణము ప్రేమలనేవి ఎంత సన్నిహితంగా సంబంధం కలిగియున్నవో గమనించు:

> మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను మెప్పైనను ఉండినయెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, [*prosphiles*] ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యానముంచుకొనుడి. [*arete* = సద్గుణము, నైతిక గుణాతిశయము] (ఫిలిప్పీ. 4:8; వివరణ నాది).

> … మీరు పూర్ణజాగ్రత్తగలవారై, మీ విశ్వాసమునందు సద్గుణమును (నైతిక గుణాతిశయమును) సద్గుణమునందు జ్ఞానమును, జ్ఞానమునందు ఆశానిగ్రహమును, ఆశానిగ్రహమునందు సహనమును, సహనమునందు భక్తిని, భక్తియందు సహోదర ప్రేమను [*philadelphia*], సహోదర ప్రేమయందు ప్రేమను [*agape*] (తెలుగులో దయను అనియుంది) అమర్చుకొనుడి (2 పేతురు 1:5–7; వివరణ నాది).

సన్మార్గము, ప్రేమ అనేవి పొత్తు కలిగియుండాలి మరియు మనము ఆ ఘనమైన గొప్ప వాటితో జతకూడాలి. క్రైస్తవులుగా యిది మనకు సవ్వాలైయుంది.

చాలనివారమనే మన సాధారణమైన ఆలోచన రెండు దిశలనుండి వస్తుంది: మొదట, మనం నివసించే లోకంలో, ఎక్కువ భాగం, "ప్రేమ" అనేదానికి అర్థాన్ని కోల్పోయింది. మన భాష మనలను మోసం చేస్తుంది: "నేను ఐస్ క్రీమును ప్రేమిస్తున్నా"; "నేను దేవుని ప్రేమిస్తున్నా"; "నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానంటే, నేను నిన్ను పొందాలి"; "పైన అదృశ్యమైన సంగతులను గూర్చిన కథ చెప్ప ప్రేమిస్తున్నా"; "నేను నా మోటర్ వాహనాన్ని ప్రేమిస్తున్నా." రెండవది, వస్తువులతోను, మనుష్యులతోను మనకున్న బాంధవ్యాలలో, "ప్రేమ" అనే మాటకు అర్థం తెలియక, దేవుని ప్రేమచేత మనం కలతపరచబడ్డాం. మర్మము, దాని శ్రేష్ఠతలో, నిజంగా గొప్పదే; కాని మానవ అంతస్థులో ప్రేమ అనే దానికి మనం అర్థాన్ని పోగొట్టుకుంటే, దేవుని "అంతస్థులో" ప్రేమను అర్థం చేసికోవాలని ఎలా నిరీక్షించగలము?

వేదించే ఈ ప్రశ్నతో తలపడే మార్గముంది, ఎందుకంటే పౌలు యిలా ప్రార్థించాడు,

> … మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరుపారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించు కొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను (ఎఫెసీ. 3:17బి–19).

అందులో మనం చేయవలసిన మూడు పనులున్నాయి: ప్రార్థన, పఠనం ఆచరణ. దేవుని ప్రేమకొరకైన ఏ పరిశీలనయైనా మనలను ప్రార్థనయందు మోకాళ్లమీదికి పంపనట్లయితే, లోపంతో అంతమౌతుంది. ఏదియెలాగున్నా ప్రార్థనయే సరిపోదు.

దేవుని ప్రేమను శ్రేష్ఠంగా గ్రహించడానికి దేవుని వాక్య పఠనం అవసరమై యుంటుంది. మనకు బోధ కలుగు నిమిత్తము ఆయన వాక్యము వ్రాయబడింది

(రోమా 15:4), మరియు దేవుని మార్గంలో వెలిగింపబడడానికి మనం చదువవలసి యుంది (2 తిమోతి 3:15). దేవునియొక్క సన్మార్గ గుణాతిశయం, సర్వశక్తి, సర్వ వ్యాపకం, సర్వ జ్ఞానం అనేవాటిని మనం ముందుగానే నొక్కి చెప్పాం. దేవునియందును ఈ లక్షణాల యొక్క అనంతమైన స్థితిని మనం గమనించాం. ప్రేమయందును దేవుడు మితిలేనివాడై యున్నాడు. ఆయన ప్రేమ శాశ్వతమైనదని, నిత్యముండునదని దేవుని పిల్లలు పలికారు (1 రాజులు 10:9; యిర్మీయా 31:3; రోమా 8:35–39).

దేవుని ప్రేమయొక్క శాశ్వత లక్షణం ఒక ప్రశ్నను లేపుతుంది. ఆయన మానవులను నిర్మించక ముందు దేవుడు ఎవరిని ప్రేమించాడు? మనం నివసించే కాలానికి ముందు నిత్యత్వముంది – మరియు దేవుడున్నాడు (యెషయా 57:15). మన ముందున్న ప్రశ్న యుక్తమైనది, మరియు జవాబు ప్రాముఖ్యమైనది. ఆ ప్రశ్న యుక్తమయ్యింది ఎందుకంటే, ప్రేమపొందే కర్మ ఉండాలని అది గుప్తం చేస్తుంది. జవాబు ప్రాముఖ్యమయ్యింది ఎందుకంటే దేవత్వంలోని వ్యక్తులను అందులోనికి తెస్తుంది. సృష్టికి ముందే సంపూర్ణమైన దేవుని ప్రేమ ఉన్నందున, ఈ ప్రేమ అనేది తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అనే వారి మధ్య నిరాటంకంగా ప్రవహించే వ్యక్తిగతమైన కమ్యూనికేషన్ అయ్యుంటుంది. ప్రభువైన యేసు తండ్రికి ప్రార్థించేటప్పుడు ఈ విషయం ప్రస్తావించారు. "లోకము పుట్టక 'మునుపు' నీవు నన్ను ప్రేమించితివి" (యోహాను 17:24బి). అప్పుడు, విశ్వానికి సంబంధం లేకుండనే, దేవుడు తనకు తాను పూర్తిగా తెలుపుకున్నాడు, తనకు తాను పూర్తిగా సమర్పించుకున్నాడు, తనకు తాను సంపూర్తిగా తెలియజేసికొనే వాడైయున్నాడు.

పరిపూర్ణమైన భావంలో యిది దేవునియొక్క భక్తి పూర్వకమైన ప్రేమ. పరిపూర్ణమైన పొందిక, అపరిమితమైన సమాధానము, ఉన్నతమైన స్వయం యిష్టము, ప్రశాంతమైన మార్పులేనితనము,[2] పవిత్రమైన సంతోషము దేవత్వంలోని ముగ్గురి మధ్య ఉంది. ఇది దేవునియొక్క పరిపూర్ణమైన ప్రేమ; ఆయన ప్రేమయొక్క అంశము తనలో తానే.

## ఆయన ప్రేమ విస్తరింపజేయబడింది

దేవుడు తన ప్రేమను తనకే ఉంచుకోడు. అది యితరులకు యివ్వబడేది కూడా. అంటే ఆయన ప్రేమకు కర్మ తనకు వెలుపల కూడా ఉండవచ్చు. సజీవుడగు దేవుడు మనకు జీవాన్ని ఎలా యిస్తున్నాడో, పరిపూర్ణుడగు దేవుడు సత్యాన్ని మనకెలా ప్రసాదిస్తున్నాడో, ప్రేమామయుడగు దేవుడు తన్ను తానే మనకు యిచ్చుకొంటున్నాడు! మనకొరకు కుమ్మరింపబడిన దేవుని ప్రేమను మనము తలపోసినప్పుడు, మన సమానుల మధ్య ఈ విధమైన ప్రేమ లేదని మనం గమనింపవచ్చు. దేవుని యొక్క మహత్తరమైన శక్తిని గూర్చి మనం ఆలోచించినప్పుడు, జ్ఞానాన్ని, అనంతమైన ప్రసన్నతలో గుండ దాటుకుంటూ వెళ్లుతుంది – ఎందుకంటే, దేవుని యొక్క పరిశుద్ధత, పవిత్రత, సన్మార్గము మరియు నీతి శాస్త్రమనే చిత్రం క్రింద ఈ గుణ లక్షణాలన్నీ యాక్టివ్‌గా ఉన్నాయని ఆలోచన! దేవుడు ప్రేమించువాడై యున్నాడు అనే గ్రహింపు మనలను విశ్రమింప జేయవచ్చు ఎందుకంటె దేవుడు ప్రేమయైయున్నాడు అనేది ఆయన పరిశుద్ధత యొక్క

ముఖ వైఖరియై ఉంది.

అలాటి ప్రేమామయుడగు దేవుడున్నాడని ఎరగడంవలన మనం లోతుగా కదిలించబడ్డాం, మరియు నిజంగా కృతజ్ఞత కలిగియున్నాం. మనపట్ల ఆయనకున్న ప్రేమకును, ఆయనపట్ల మనకున్న ప్రేమకును మధ్యగల గొప్ప ఖాళీచే మనం యింకను కలవరపెట్టబడవచ్చు. ప్రభువైన యేసుయొక్క శిష్యులు ప్రార్థన విషయంలో ఎలా ఆలోచించారో, ఆయన ప్రేమను గూర్చి మనం కూడా అలాగే అనుకోవచ్చు. ఒక సందర్భంలో ప్రభువు ప్రార్థించుట చాలించిన తరువాత, "ప్రభువా ప్రార్థన చేయుట మాకు నేర్పించుము" అని వారాయనను అడిగారు (లూకా 11:1బి). దేవుని ప్రేమను మనం అవలంభించడానికి లోకసంబంధమైన మానసిక పరిస్థితిని మనం నిలుపవలసి యుంటుంది. ప్రేమయనే ఆయన ప్రస్తావనకు మనం బదులు యివ్వ దలచుకుంటే, దేవునితో మనస్సులు కలుపుతూ ఉండాలి.

మొదట, క్రైస్తవ భావనలో ప్రేమంటే ఉద్వేగం కాదని మనం గుర్తించాలి. అది "(ఫీలింగ్స్) భావోద్రేకముల స్థితి కాదుగాని చిత్తము యొక్క స్థితియైయుండాలి ..."[3] ప్రేమను ఇంద్రియ సంబంధమైన దానికి సమానంగా ఆలోచించే సమాజంలో పెంచబడిన తరువాత ఇది మనకు భయంకరమైనదిగా గోచరించవచ్చు. ప్రేమ అంటే 90 శాతం సెక్స్ అని నమ్మే సమాజం దేవుని ప్రేమను గ్రహించి, అభినందించగలగడానికి బహు దూరంగా ఉండవచ్చు. *eros* అనే పదం క్రొత్త నిబంధనలో కన్పించక పోయినా, eroticism యొక్క అపాయములు గట్టిగా చెప్పబడ్డాయి (మత్తయి 5:27-29; 1 కొరింథీ. 6:18-20).

తప్పకుండ, దేవునిచే అంగీకరింపబడే ప్రేమ దానికంటే హెచ్చు స్థాయిలోనే వ్యక్తపరచబడాలి. మానవ జాతిని విస్తరింపజేయడానికిని, మరియు లైంగిక ప్రేమను పంచుకునే సన్నిహిత బాంధవ్యాలను ప్రసాదించడానికిని వివాహమనే ఏర్పాటు దేవునిచే కల్పింపబడింది. దేవుడు సంకల్పించినట్టు వివాహము పని చేస్తుంటే, దేవుడు దానికి ఎంతటి ఉన్నతమైన స్థాయినను గ్రహించాడంటే, క్రీస్తుకును, సంఘానికిని ఆయన దానిని పోల్చాడు (ఎఫెసీ. 5:22-33).

ప్రేమను వ్యక్తపరచుకొనడానికి స్నేహము మరొక రమ్యమైన మార్గం. వాస్తవానికి, "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగలవాడెవడును లేడు" అని ప్రభువే అన్నారు (యోహాను 15:13). *philos* అనే నామవాచకం, సాధారణంగా స్నేహాన్ని చూపడానికి పన్నెండు సార్లు ఉపయోగించబడింది (యోహాను 11:11; లూకా 12:4). స్నేహితుల కొరకు ప్రేమను కనుపరచడానికి *phileo* అనే క్రియా వాచకం కూడా లేఖనాల్లో తరచుగా వాడబడింది (యోహాను 11:3), ప్రభువు కొరకు ప్రేమ (యోహాను 11:15బి), మరియు తల్లిదండ్రుల కొరకు ప్రేమ (మత్తయి 10:37).

## ఆయన ప్రేమ ప్రదర్శింపబడింది

ప్రేమయైయున్న దేవుడు కనుపరచినది అత్యంత ఉన్నతమైనది (1 యోహాను 4:8).

*Agapao* అనేది క్రొత్త నిబంధనలో వందల సార్లు ఉపయోగించబడింది. అత్యున్నతమైన జీవితపు స్థాయిలో జీవించడానికి ఈ ప్రేమ పిలుపునిస్తుంది. దానికి మూలము పరలోకము, అక్కడికి మనలను తోడుకొని పోడానికి అది చిత్రించబడింది. అది అస్పష్టమైనది కాదు. అది కేవలం ప్రభావమూ కాదు. మన కొరకు దేవునికి ఉన్న ప్రేమ ప్రాముఖ్యమైనది, జీవించు లక్షణమైయున్నది.

చరిత్రలో ఆ ప్రేమ తన కుమారుడైన యేసుక్రీస్తును – ప్రేమ కానుకగా సమర్పించడంలో ప్రదర్శించబడింది. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). ఇది *agape*, సమస్తమునిచ్చు ప్రేమ. తండ్రికి మనపైనున్న ప్రేమ ప్రభువైన యేసును అనుగ్రహించడంలో కనబడడం మాత్రమే గాక, కుమారునికి తండ్రిపైనున్న ప్రేమను కూడా కనుపరచుతుంది. గెత్సేమనెలో, తన తండ్రి చిత్తం నెరవేర్చబడాలని గొప్ప ఆవేదనతో ప్రార్థించాడు; ఆయన యిష్ట పూర్వకంగా తన్ను తాను అర్పించుకున్నాడు. భూమిమీద అది అత్యంత విస్తారమైన ప్రేమయైయున్నది – మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా తండ్రియొక్క చిత్తానికి మనలను మనం ధారాళంగా సమర్పించుకొనడం.

> మనము దేవుని ప్రేమించుచు ఆయన ఆజ్ఞలను నెరవేర్చువారమైతిమా దేవుని పిల్లలను ప్రేమించుచున్నామని దానివలననే ఎరుగుదుము. మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు (1 యోహాను 5:2, 3).

సూచనలు

[1]Plato *The Republic* 427E-29B. [2]"Immutability" మార్పుచెందని దేవుని స్వభావాన్ని సూచిస్తుంది.
[3]C. S. Lewis, *Mere Christianity* (New York: Macmillan Co., 1960), 115.